# అక్క - తమ్ముడు

[ కథానిక ]

శ్రీ జొన్నలగడ్డ వేంకట రాధాకృష్ణయ్య

తెల్లవారితే ఉగాది. తమ్ముడు భోజనానికివస్తే బాగుండును. తోడపుట్టినవాడు-పదిహేడేళ్లైనా నిండలేదు, తన ఇంట్లోవుండి ఇన్ని మెతుకులు తింటూ, చదువుకోడానికి నోచుకోలేదు. ఎక్కడో కాలేజీలో చదువు—ఎవరి ఇంట్లోనో బస—హోటల్లో భోజనం—తనుకూడా పట్నంలో వుండబట్టే ఆ బాధ. తనెక్కడోవుంటే ఈ వెత ఎందుకుంటుందీ ?

ఎన్నాళ్లయిందో చూచి ! ఆ హోటలు మెతుకులు అరుగుతున్నాయో లేదో ! ఒక్కడూ ఎలా ఇదవుతున్నాడో—

తనభర్తకు తనమీద ఆపేక్ష అనంతం. అయితేనేం ఈ విషయంలో ఆయన అనకుండా తానై ప్రసక్తి తెస్తే ఆయన ఏమన్నా అనుకోవచ్చు.

ఇంతకీ తన వెర్రిగాని, ఇష్టముంటే, తన తమ్ముడు పట్నంలోనేవుండి చదువుకుంటున్నాడని ఆయనకు తెలియదూ ? తెలిసే ఊరుకొన్నపుడు తను అడిగి వద్దు అనిపించుకోవటమా—ఛీ—"



"ఆ వెయ్యేళ్ల పూజారి నాకెక్కడ కనిపిస్తాడు"

వంటింట్లో కూరలు తరుగుతూ శ్యామల యీ విధంగా తలచుకొంటున్న సమయంలోనే 'శ్యామా' అని ఆయన కేకవేశాడు.

"ఇదిగో, మా స్నేహితుడు సుబ్బారావు వచ్చాడు కాకినాడనుంచి. రేపు భోజనానికి రమ్మని పిలిచాను. మరి ఎలాచేస్తావో వంట. వీరిగాణ్ణి మార్కెట్‌కు పంపి బంగాళా దుంపలు, కాలీఫ్లవర్, కారట్ మొదలైనవి తెప్పించు. డబ్బు అలమారలో వుంది."

ఇలా అంటూ మేడ మెట్లు దిగుతూంటే శ్యామల తెగించి 'మరేం' అంది.

'మరేం—ఏమిటి కానీ ?' అన్నాడు శేషారావు.



"మరేం తమ్ముడ్ని పిలవండి"

# అక్క - తమ్ముడు

"మా తమ్ముడు సుందరాన్నికూడా పిలవండి. షికారు నుంచి వచ్చేటప్పుడు వాడి గదిదగ్గరకువెళ్లి రమ్మంటే వాడే వస్తాడు. తలకు నీళ్లయినా లేకుండా ఎక్కడో అవస్థ పడుతూ......"

"ఉహు! ఇప్పుడు ఆ వెయ్యిళ్ల పూజారి నా కెక్కడ కనిపిస్తాడు, ఉట్టినే శ్రమ పడటంగాని. నేను షికారు వెళ్లేది బీచికిగాని కిల్పాకా? అబ్బే. నాకు అక్కడకు వెళ్లాలంటే కనీసం రెండుమూడు గంటల పనిపాడు" అన్నాడు శేషారావు.

స్నేహితుడు వస్తాడని చెప్పినపుడు అతని ముఖంలో కనిపించిన సంతోషం తన తమ్ముడు పేరెత్తేసరికి మాయమై, ముడుచుకుపోవడాన్ని చిన్నదైనా శ్యామల కనిపెట్టక పోలేదు.

"వీలువుంటే నే-లేకపోతే వద్దు" అని శ్యామల వంటింట్లోకి వెళ్లిపోయింది.

రాత్రి తొమ్మిదింటికి శేషారావు తిరిగివచ్చాడు. కాని అతడు సుందరాన్ని కలుసుకున్నాననిగాని, లేదనిగాని శ్యామలతో చెప్పనూ లేదు, శ్యామల అడగనూలేదు.

* * *

ఆవేళ ఉగాది. భర్తకు తలంటి నీళ్లుపోసి, తనుపోసుకొని శ్యామల వంటలో మునిగింది. స్నేహితునికోసం వెళ్లిన శేషారావు 11½ గంటలకు తిరిగివచ్చి "సుబ్బారావు భోజనానికి రావడంలేదు. వాళ్ల బంధువులు అతణ్ణి రానివ్వలేదు" అన్నాడు.

శ్యామల ఏమీ బదులు చెప్పలేదు. ఏమనాలోకూడా తోచలేదు. ఇంతలో వీధిలో సైకిల్ బెల్ మ్రోగింది. మరుక్షణంలో సైకిల్ గోడకు జేరవేసి, సుందరం చరచర లోపలికి వచ్చాడు.

శేషారావు అతణ్ణిచూసి, పలకరించకుండానే పైకి వెళ్లిపోయాడు.

'ఏమిరా ఇలా వచ్చావు'? అంది శ్యామల.

'పండుగకాదే అక్కా భోజనానికి వచ్చా' నంటూ తిన్నగా మేడమీదికి వెళ్లాడు సుందరం.

ఇద్దరకు వడ్డించి, శ్యామల పిలిచింది. ఇద్దరూ వచ్చారు. భోజనం చేశారు. సుందరం అడక్కపోయినా ఏవో కాలేజీ కబుర్లు చెప్పుకువచ్చాడు.

భోజనం పూర్తికాగానే, తమలపాకులు చేత్తో పట్టుకుని శేషారావు మేడమీదికి చక్కా పోయాడు.

అక్కడే కూర్చొన్న సుందరాన్నిచూసి శ్యామల 'నిన్న మీ బావనీకోసం వచ్చారా ఏమిటి?' అని ప్రశ్నించింది.

'లేదు అక్కా. నా మట్టుకు నేనే వచ్చా.'

'పిలవని పేరంటానికి ఎవరైనా వస్తారా? తప్పు కాదూ?' అంది.

'అక్క తమ్ముణ్ణి బొట్టెట్టి పిలవడం ఎందుకమ్మా.' అన్నాడు సుందరం నవ్వుతూనే.

'నవ్వుతావెందుకు? సిగ్గులేకుండా, పిలవందే భోజనానికెలా వచ్చావురా?' అన్నదామె.

ఆమె ఊరికే అనటం లేదని తీవ్రంగానే అంటున్నదని గ్రహించి సుందరం రిచ్చపడ్డాడు.

ఇక కూర్చోలేదు. లేచాడు.

'తప్పే అక్కా. క్షమించు. మరెప్పుడూ రానులే' అంటూ వీధిలోకి వెళ్లిపోయాడు.

ఆమె రెండడుగులు ముందుకువేసింది. సైకిల్ ఎక్కి అతడు వెళ్లిపోవడం ఆమెకు కనిపించింది.

ఆమె కళ్లనుంచి అశ్రువులు కాలవకట్టేయి. తనుకూడా అన్నం వడ్డించుకుందామని పీటమీద కూర్చుని, అలా ఎంతోసేపు ఏడ్చి, ఆమె ఆ ప్రక్కనే కొంగుపరుచుకొని నిద్రపోయింది.

ఆరాత్రి భోజనంచేస్తూ శేషారావు 'మీ తమ్ముడు మళ్లీ కనిపించకుండా అలానే చక్కాపోయాడేమే?' అన్నాడు.

ఆమె ఏమీ అనలేదు.

'మీవాడు వచ్చాడు కనకచేసినది వృథాకాలేదు. సుబ్బారావు రానందుకు మీవాడుకూడా రాకపోయివుంటే ఏ దాసి మనిషికో పారవెయ్యవలసి వుండేది ఆ చేసిందంతా' అన్నాడు.

అలా అని శేషారావు ఆమె వంకచూశాడు. శ్యామల ముఖవైఖరిచూసి నాలిక కరుచుకొని అతడు తిరిగి ఏమీ అనకుండానే భోజనం పూర్తిచేసి చక్కాపోయాడు.

*　　*　　*

కాలచక్రంలో ఆరుమాసాలు గిర్రున తిరిగాయి. ఒక నాటి రాత్రి శ్యామలనుచూసి శేషారావు ఇలా అడిగాడు.

"ఏమోయ్! మీ తమ్ముడి పెళ్లి మాట ఏమీ ఆలోచించరా ఏమిటి మీవాళ్లు?"

"ఏమో నాకేం తెలుస్తుంది వాడి పెళ్లిమాట. అయినా ఇప్పుడు వాడి పెళ్లికేం తొందరొచ్చింది?"

"తొందరేమిటి? పదిహేడు, పద్ధెనిమిదేళ్ల వయస్సు వాడు—పెళ్లాం కాపరానికివస్తే ఈ సరికి ముగ్గురు బిడ్డల తండ్రై వుండేవాడు. మనకు కావలసిన సంబంధం ఒకటి వచ్చిందిలే, కట్నం కానుకలు బాగా ముట్టచెబుతారు." అన్నాడు.

ఆమె ఏమీ జవాబివ్వలేదు.

"మన సుబ్బారావు లేడూ—ఆనాడు ఉగాదికి భోజనానికి వస్తాడన్నానే—వాళ్ల అక్క ట్రిప్లికేన్‌లోనే కాదు కాపరం వుంటూ. వాళ్ల అమ్మాయివుంది. బాగా ఎదిగి కూచుంది. ఆ కుర్రదాని నిచ్చి పెళ్లి చేయిద్దామని."

"చాలు చాలు. నిన్న వచ్చిందావిడ ఇక్కడికి. ఎందుకు కర్రి మొద్దులా ఆపిల్ల. కాకి అయినా నయమే. చదువులేదు. చట్టుబండలు లేదు. మావాడు అసలేనూకరాల నూరప్ప. చుంచులా మూతీదాన్ని చూస్తే, చూపించినవాళ్లకి కూడా మాట దక్కకుండా చేస్తాడు."

"నల్లగావున్నవాళ్లుమాత్రం అందంగా వుండరూ. నువ్వేం మహా పచ్చ దబ్బపండులా వున్నావో? నల్లని చ్ఛాయ అయితేం, ఎంత లక్షణంగా వుంటుంది ఆ పిల్ల"? అన్నాడు శేషారావు.

"చాల్లెండి. ఆ కోతిపిల్లని మా తమ్ముడు చేసుకోడు" అంది శ్యామల.

"నీ మొహం. నీకేం తెలుసే మంచీచెడ్డా. నాలుగువేల రూపాయలిస్తారు కట్నం. కావాలంటే మీవాణ్ణి లండన్ పంపి చదివిస్తారు కూడాను. మీనాన్నకి నేను అప్పుడే వుత్తరం రాయడంకూడా జరిగింది." అన్నాడతడు.

"అయితే ఇక నాతో ఎందుకు ఈ సొదంతాను?"

"అడబడుచు లాంఛనాలడుగుతావేమో అని."

శ్యామల మూతి విరిచింది.

*　　*　　*

ఆ మరునాటి సాయంకాలం ఆఫీసునుంచి శేషారావు ఇంటికి ఆలస్యంగా వచ్చాడు.

రాగానే "మీ తమ్ముడు చాలా గొప్పవాడు. ఊళ్లో మనం వున్నాం గదా మనికి ఫోన్ చెయ్యకూడదా. ఓకార్డురాసి పడేయ్యకూడదా? పోనీ ఎవరిచేతన్నా కబురంపవచ్చునే" అన్నాడు.

"అసలు ఏం జరిగిందో చెప్పక, ఈ సొదింపంతా ఎందుకు? ఏమైనాడు? కులాసాగా వున్నాడా?" అంది శ్యామల ఆత్రంతో.

"కులాసాగానే వున్నాడులే. 10 రోజుల క్రిందట జ్వరం వచ్చిందట. ఆస్పత్రిలో వున్నాడు. రేపు డిశ్చార్జి చేస్తారట." అంటూ మేడమీదికి వెళ్లాడు.

శ్యామల మనస్సులోనుంచి దుఃఖం సముద్ర తరంగాల్లా పొంగి పొరలివచ్చింది. "ఆనాడు తను అలా అనడం వాడికి కష్టం తోచింది కాబోలు. జబ్బుచేసి ఆసుపత్రిలో పడేసినా కబురుచేశాడు కాదు. ఎంత పాపిష్టిదాన్ని? అనరాని మాటలన్నాను కదా వాణ్ణి ఆవేళ" అనుకొని ఏడ్చింది.

భర్త రాగానే అతను చూడకుండా కళ్ల నీరు తుడిచివేసుకోడానికి యత్నించింది గాని ఆమె ముఖమండలాన్ని ఆక్రమించిన విషాదమేఘాల నతడు గమనించక పోలేదు.

మరునాడు ఆదివారం.

వంట పూర్తిచేసి శ్యామల వీధి గుమ్మంలోకి వచ్చేసరికి భర్త, తమ్ముడు ప్రత్యక్షమయ్యారు.

రావోయి సుందరం అంటూనే శేషారావు అతణ్ణి మేడ మీదకు తీసుకు వెళ్లాడు.

"కోతిపిల్లనిముద్దెట్టడానికి ఈ ఎత్తు. ఏమైనా సరే ఈ యత్నం నెరవేరనీయకూడదు. వాడెమ్మ—రా అని పిలిచేటప్పటికి ఉబ్బిపోయినట్లున్నాడు." అనుకుంది ఆమె.

ఆ రాత్రి తమ్ముడితో ఒక్కనిమిషం మాట్లాడడానికి వీలిచ్చిందికాదు. భర్త రోజూలేచేసరికి ఉదయం ఎనిమిదవుతుంది. తెల్లవారగానే తమ్ముడితో మాట్లాడుదామనుకుంది శ్యామల కాని అదేం విరుద్ధమో, తనకంటెముందుగా భర్త నిద్రనుంచి మేల్కొన్నాడు.

11 గంటలకు భోజనాలైనాక భర్త మేడమీదికి వెళ్లగానే కంటితోనే 'ఇలా రా' అని శ్యామల తమ్ముడికి సంజ్ఞ చేసింది.

అతడు రాగానే కోపం (ఎవరిమీదో—?) ఆపుకోలేక "నీకు దేముడు అభిమానం సిగ్గుపెట్టలేదూ? ఆయన రమ్మనేసరికి ఉబ్బిపోయి చక్కా వచ్చావా? ఛీ! ఎందుకు వచ్చిన జన్మరా. పౌరుషంలేని జన్మ?" అంది.

సుందరం నిశ్చేష్టుడైనాడు. నోటమాట రాలేదు.

"తప్పేనమ్మా, బుద్ధిలేకే వచ్చాను. ఇదిగో వెళుతున్నా. ఈ వీధిలో ఎప్పుడేనా కనిపిస్తే చెప్పుతీసికొట్టు" అంటూ బిక్కముఖంతో వీధిలోకి వెళ్లి ఓ రిక్షావాణ్ణి పిలిచాడు.

సుందరంతో అసలు విషయం కదలేద్దామనుకుంటున్న శేషారావు అతడు ఇంకా పైకి రాలేదని మెట్లదగ్గరకువచ్చి "సుందరం?" అని కేకవేశాడు.

బదులు రాలేదు. క్రిందకు దిగాడు.

సుందరం రిక్షాలో కూర్చుని చక్కాపోవడం, వంటింట్లో శ్యామల వెక్కివెక్కి ఏడుస్తూ వుండటంచూచి శేషారావు నిలువునా నీరైపోయాడు!

★


# ఆంధ్ర మహిళా సభ

మైలాపూరు : : మద్రాసు.

మహిళాభ్యున్నతి పరమాశయముగా గల ఆదర్శ సంస్థ

| | |
|---|---|
| విద్యాశాఖ : | తెలుగు విద్వాన్, హిందీ, బెనారెస్ మెట్రిక్, ఇంటర్మీడియేట్ పరీక్షలకు శిక్షణ తరగతులు. |
| కళాశాఖ : | సంగీతము (గాత్ర వాద్యములు), భరతనాట్యము, చిత్రలేఖనము. |
| రాణీ రాజ్యలక్ష్మి పారిశ్రామిక శాఖ : | చేతికాగితపు పరిశ్రమ, కుట్టు, లేసు పని, ఇతర గృహ పరిశ్రమలు. |
| మతవిషయికము : | హైందవ మత ధర్మ ప్రచారము. |
| క్రీడా వినోదములు : (క్లబ్బు శాఖ) | విద్యార్థినులకు, సభ్యులకు ఇన్‌డోరు, అవుట్ డోరు ఆటలకు ఏర్పాట్లు. సభ్యురాండ్ర స్నేహ సమావేశాలకు కేంద్రము. |

విద్యార్థినులకు హాస్టలు సౌకర్యములు